నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 3 మే 2024 | YADADRI BHUVANAGIRI

## ‘పట్టభద్రుల ఎమ్మెల్సీ’కి తొలిరోజు మూడు నామినేషన్లు

- ఈ నెల 9వరకు నామినేషన్ల స్వీకరణ, 10న స్క్రూటినీ, 13న ఉపసంహరణ
- 27న పోలింగ్, జూన్ 5న ఫలితాలు

నల్లగొండ, మే 2 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి ఉప ఎన్నికలో భాగంగా మొదటి రోజు గురువారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. ప్రజావాణి పార్టీ తరపున పాటి శ్రీకాంత్ రెడ్డి ఒక సెట్, తెలంగాణ సకల జనుల పార్టీ నుంచి నందిపాటి జానయ్య ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా బండారు నాగరాజు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం ఉపఎన్నికకు గురువారం ఉదయం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 9వరకు ఈ ఎన్నికకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ జరుగనుండగా 10న స్క్రూటినీ, 13న ఉపసంహరణ అనంతరం అదే రోజు అభ్యర్థుల జాబితాను గుర్తులను కేటాయిస్తూ విడుదల చేయనున్నారు. ఈ నెల 27న పోలింగ్ నిర్వహించి వచ్చే నెల 5న ఫలితాలు వెల్లడించనున్నట్లు రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన తెలిపారు.

## నేడు హరీశ్‌రావు రోడ్ షో

- నల్లగొండ, చండూర్‌లో ఏర్పాట్లు

నల్లగొండ ప్రతినిధి, మే 2 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా భువనగిరి, నల్లగొండ లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్ ప్రచారాన్ని మరింత ముమ్మరం చేసింది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా పరిధిలో పార్టీ అధినేత కేసీఆర్ బస్సుయాత్ర పూర్తి కాగా హరీశ్ రావు, కేటీఆర్ రోడ్ షోలకు ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నీ తానై అభ్యర్థుల ప్రచార బాధ్యతలు తన భుజాలపై వేసుకుని ముందుకు నడిపిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు భువనగిరి అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు మద్దతుగా చండూర్‌లో జగదీశ్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు రోడ్ షోలో పాల్గొననున్నారు. అనంతరం నల్లగొండ పట్టణానికి చేరుకుంటారు. నల్లగొండ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డికి మద్దతుగా సాయంత్రం 6గంటలకు ఎన్జీ కాలేజీ నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు జరిగే రోడ్ షోలో పాల్గొంటారు. అక్కడే ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. నల్లగొండ నియోజకవర్గ పార్టీ శ్రేణులు, ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు జనం సిద్ధం

- ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది
- బీఆర్‌ఎస్‌కు వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీ కుట్రలు
- బీఆర్‌ఎస్ సమావేశంలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



తుర్కపల్లిలో బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, చిరుమర్తి లింగయ్య, బూడిద భిక్షమయ్య గౌడ్

తుర్కపల్లి, మే 2 : పార్లమెంట్ ఎన్నికల్లో 16 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు మంచి మెజార్టీతో విజయం సాధించబోతున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల కేంద్రంతోపాటు మాదాపురం, వీరారెడ్డిపల్లి, దత్తాయిపల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 వాగ్దానాలను నమ్మి మోసపోయి ప్రజలు ఆ పార్టీకి అధికారమిచ్చారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హామీలను మరిచి గారడి మాటలతో ప్రజలను వంచించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూడు నెలల్లోనే తమను మోసం చేసిందని ప్రజలు గమనించారని, పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ రోడ్‌షోలకు ప్రజల నుంచి భారీగా వస్తున్న స్పందనను చూసి ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు కలిసి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సభల్లో చేస్తున్న బూతు పురాణం ఎన్నికల కమిషన్‌కు కనబడడం లేదా? అని ప్రశ్నించారు. పార్టీ కార్యకర్తలు ప్రతి ఓటరును కలిసి కాంగ్రెస్ మోసాలను వివరించాలని, వారు ఓటు వేసే వరకు బాధ్యత తీసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రజలను ఓటు అడిగే నైతిక హక్కు బీఆర్‌ఎస్‌కే ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను మరిచిందని గ్రామాల్లో ప్రజలు ఆ పార్టీపై వ్యతిరేకతతో ఉన్నారని తెలిపారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ సౌమ్యుడు, మచ్చలేని నాయకుడు క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కార్యకర్తలు మరో 10 రోజులు కష్టపడాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ బీకూనాయక్, ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి యుగేందర్‌రావు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సుదగాని హరిశంకర్‌గౌడ్, కల్లూరి రామచంద్రారెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నరసింహారెడ్డి, నాయకులు కల్లూరి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, కర్ణాకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### ప్రజల విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ప్రజల విశ్వాసం కొల్పోయిందన్నారు. అభివృద్ధి ప్రధాత కేసీఆర్‌ను వదులుకొని తప్పు చేశామనే భావన ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తుందని, మళ్లీ బీఆర్‌ఎస్‌ను కోరుకుంటున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### మాదిగలకు ఒక్క సీటూ ఇవ్వని కాంగ్రెస్

భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకుండా ఆ సామాజిక వర్గానికి మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్ అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యత కల్పించిందని చెప్పారు. బీఆర్‌ఎస్ పదేండ్ల పాలనలో చెరువులు మత్తడి దుంకి గ్రామాల్లో ఎటుచూసినా ధాన్యపు రాశులు దర్శనమిచ్చాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో చెరువులు ఒట్టిపోయి, పంట పొలాలు ఎండిపోయి రైతులు అరిగోస పడుతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆశీర్వాదంతో భువనగిరి ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని, 24గంటలు అందుబాటులో ఉంటూ ప్రజల కష్టసుఖాల్లో పాల్పంచుకుంటానని, కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కే. జండగే



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, మే 2 : పోలింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత్ కె.జెండగే సెక్టార్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులకు రెండో విడుత అవగాహన కార్యక్రమంలో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో వసతులు, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు నిర్వహించే విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. భువనగిరి, ఆలేరు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి 72 రూట్లకు గానూ 72 మందిని సెక్టార్ అధికారులుగా నియమించి మేజిస్టీరియల్ పవర్స్ ఇచ్చినట్లు తెలిపారు. పోలింగ్ నిర్వహణలో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని, ఎన్నికల నిబంధనలను కచ్చితంగా అమలుచేయాలన్నారు. పోలింగ్ కేంద్రం చుట్టూ వంద మీటర్ల పరిధిలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాలకు సంబంధించి బూత్ లెవల్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో ఓటర్లకు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా వినియోగించుకునేలా కార్యాచరణ ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పులు వంద శాతం పంపిణీ అయ్యేలా చూడాలన్నారు. ఎన్నికల ముందు రోజు సామగ్రి పంపిణీ, సిబ్బంది తరలింపు, ఎన్నికల రోజున తమకు కేటాయించిన రూట్ల పరిధిలో శాంతిభద్రతలకు ఇబ్బంది లేకుండా తాసీల్దార్లు పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు.

ముఖ్యంగా పోలింగ్ విధానంపై పూర్తి పట్టు ఉండాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు వంద శాతం ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలను ఉల్లంఘించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ ముందు రోజు ఉదయం 7 గంటలకే డిస్ట్రిబ్యూషన్ సెంటర్ చేరుకోవాలని, స్టాట్యుటరీ, నాన్ స్టాట్యుటరీ మెటీరియల్ పొందాలన్నారు. సమావేశంలో ఆలేరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గంగాధర్, భువనగిరి అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అమరేందర్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు నర్సిరెడ్డి, హరినాథరెడ్డి పాల్గొన్నారు.



నకిరేకల్ నియోజకవర్గ ట్రైనింగ్ నోడల్ అధికారి ఎం.నాగయ్యకు వినతిపత్రం అందిస్తున్న ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు

## రెమ్యూనరేషన్ పెంచకపోతే ఈవీఎంలు ముట్టుకోం

- శిక్షణ తరగతుల్లో లంచ్ ఎందుకు పెట్టరు?
- నకిరేకల్‌లో పీఓలు, ఏపీఓల ఆందోళన

నకిరేకల్, మే 2 : మున్సిపాలిటీ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం నియోజకవర్గ ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు రెండో విడుత ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు విడుతలుగా శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. ఈ శిక్షణలో తమకు సరైన వసతులు కల్పించడం లేదంటూ పీఓలు, ఏపీఓలు ఆందోళనకు దిగారు. కనీసం భోజన వసతి కల్పించకుండా చాయ్, బిస్కెట్‌తో సరిపెట్టారంటూ మండిపడ్డారు. 46 డిగ్రీల ఉష్ణోగ్రతలో కనీస భోజన వసతులు కల్పించకపోతే వడదెబ్బకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. రిటర్నింగ్ అధికారులు నియోజకవర్గానికో తీరుగా రెమ్యూనరేషన్ ఇస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికల్లో రంగారెడ్డి, మలక్‌పేటలో రూ.2500, రూ.2400 ఇచ్చారని, దేవరకొండలో మరో విధంగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నకిరేకల్‌లో రెమ్యూనరేషన్ తక్కువగా ఇచ్చారని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఇచ్చే చార్ట్ ప్రకారం రెమ్యూనరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మే 12న కూడా ఇదేవిధంగా ప్రవర్తిస్తే ఎలక్షన్ మెటీరియల్, ఈవీఎంలు ముట్టుకోకుండా నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ రోజు భువనగిరిలో లంచ్ ఏర్పాటు చేశారని, రంగారెడ్డిలో రెండు పూటల శిక్షణ ఉందని, నకిరేకల్‌లో ఒక్కో పూట శిక్షణ పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. శిక్షణకు వచ్చి వడదెబ్బకు గురై వికారాబాద్‌లో ఒకరు చనిపోయారని తెలిపారు.

నకిరేకల్‌లో లంచ్ ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నిస్తే అధికారుల నుంచి సమాధానం లేదని తెలిపారు. రెమ్యూనరేషన్‌లో తేడాలను సవరించి తెలంగాణ ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇతర జిల్లాల మాదిరిగా రెమ్యూనరేషన్ ఇస్తేనే పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహిస్తామని, లేదంటే మూకుమ్మడిగా విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎలక్షన్ నోడల్ అధికారి నాగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై ఎలక్షన్ ట్రైనింగ్ నోడల్ అధికారి ఎం.నాగయ్యను వివరణ కోరగా వసతులు, రెమ్యూనరేషన్ అనేవి జిల్లా ఎలక్షన్ అథారిటీ, కలెక్టర్ నిర్ణయమేనన్నారు. రెమ్యూనరేషన్ గురించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

# కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- జిల్లా అభివృద్ధిపై చర్చకు జానారెడ్డి సిద్ధమా?
- గతంలో రాజవరం మేజర్ కాల్వలో నీళ్లు ఎందుకు రాలేదు
- హామీలను మరిచిన కాంగ్రెస్‌కు ప్రజలెందుకు ఓటెయ్యాలి
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- హాలియాలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం
- మాజీ ఎమ్మెల్యే నోముల ఆధ్వర్యంలో రోడ్ షో



హాలియా రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, పక్కన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్, బీఆర్‌ఎస్ నేతలు

హాలియా, మే 2 : తెలంగాణ రాష్ట్రానికి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం హాలియాలో భారీ ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హామీలిచ్చి మోసం చేసినందుకా.. నల్లగొండ జిల్లాలో, నాగార్జున సాగర్ నియోజకవర్గంలో వేలాది ఎకరాలను ఎండబెట్టినందుకా? అని ప్రశ్నించారు. వంచన చేయడం కాంగ్రెస్ పార్టీ అన్నారు. మళ్లీ కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే వాళ్ల మోసాలను ఆమోదించిన వాళ్లమవుతామని తెలిపారు. హామీలిచ్చి అమలు చేయని ఆ పార్టీకి ఓటు అనే ఆయుధంతో కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలు, నాగార్జున సాగర్ నియోజకవర్గ అభివృద్ధిపై తాను సిద్ధం.. జానారెడ్డి సిద్ధమేనా అని సవాల్ విసిరారు. జానారెడ్డి 17సంవత్సరాలు మంత్రిగా ఉండి ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఎన్ని నిధులు తీసుకొచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. తాను పదేండ్లలో నల్లగొండ జిల్లా అభివృద్ధికి తీసుకొచ్చిన నిధుల్లో జానారెడ్డి 25 శాతం కూడా తీసుకురాలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే నాగార్జున సాగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. హాలియా, నందికొండను మున్సిపాలిటీలు చేయడంతోపాటు ప్రతి గ్రామానికీ తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చామని, హాలియాకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తీసుకొచ్చిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదేనని తెలిపారు. జానారెడ్డి హయాంలో రాజవరం మేజర్ కాల్వలో నీళ్లు ఎందుకు రాలేదో, కాల్వ చివరి భూములకు సాగునీరు ఎందుకు అందలేదో, ఇప్పుడు ఎందుకు అందుతున్నాయో జానారెడ్డి చెప్పాలన్నారు. నాగార్జున సాగర్ నియోజకవర్గంలో యాసంగిలో 25వేల ఎకరాలు ఎండిపోతున్నా ఆయన ఎందుకు పట్టించుకోలేదో, ఆ బాధ్యత ఎవరిదో జానారెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. నాగార్జున సాగర్ నియోజకవర్గ ప్రజలు తనను 35 ఏండ్లు మోసింద్రు.. ఇప్పుడు తన కుమారులను ప్రజల భుజాల మీద బలవంతంగా పెట్టి జానారెడ్డి మోపిస్తుండ్రు అని విమర్శించారు. నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ద్వారా పాలేరుకు 12రోజులు నీళ్లు పోయినప్పటికీ నియోజకవర్గ ప్రజలకు చుక్క నీళ్లు ఇప్పించలేని అసమర్థ నాయకులు జిల్లా మంత్రులని మండిపడ్డారు. రైతు బంధు రాలేదంటే చెప్పుతో కొట్టమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గతంలో అన్నారని తెలిపారు. నిన్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు తనకు ఇప్పటికీ రైతు బంధు రాలేదని అన్నారని, ఇప్పుడు తుమ్మలను కోమటిరెడ్డి అయినా చెప్పుతో కొట్టాలి.. లేకుంటే కోమటిరెడ్డిని తుమ్మల అయినా చెప్పుతో కొట్టాలని అన్నారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని, బీఆర్‌ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, ఆప్కాబ్ మాజీ చైర్మన్ యడవల్లి విజయేందర్‌రెడ్డి, ఎంపీపీలు సుమతీ పురుషోత్తం, జయమ్మ, జడ్పీటీసీ సూర్య బాష్యానాయక్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కడారి అంజయ్య యాదవ్, మండలాధ్యక్షులు, నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



హాలియాలో రోడ్ షోలో పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలతో కలిసి నడుస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

### మీ బిడ్డగా సేవలందిస్తా..

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే మీ బిడ్డగా సేవలందిస్తా. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. జిల్లాలో 11.60 లక్షల ఎకరాలకు సాగునీరు, ఇంటింటికీ తాగునీరు అందించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీదే. జిల్లాలో ఇద్దరు మంత్రులు ఉన్నప్పటికీ సాగునీటిని తీసుకొచ్చి రైతుల పంటలను కాపాడటంలో విఫలమయ్యారు. తనను ఎంపీగా గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలు చేసేలా ప్రజల పక్షాన పోరాడుతా.

–కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి

### రైతును రాజు చేసిన ఘనత కేసీఆర్‌దే..

నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలు గత పదేండ్ల కేసీఆర్ పాలన, నేటి నాలుగు నెలల రేవంత్‌రెడ్డి పాలనను బేరీజు వేసుకొని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేసి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలి. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్, రైతుబంధు, రైతు బీమా ఇవ్వడంతోపాటు రైతు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసి రైతును రాజు చేశారు. రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్న కేసీఆర్‌కు అండగా నిలువాలి.

–ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్సీ

## క్యామ మల్లేశ్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి




నకిరేకల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్

నకిరేకల్, మే 2 : బీఆర్‌ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కోరారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నకిరేకల్ పట్టణంలోని 1, 2 వార్డుల్లో ఆ పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటన తరువాత కార్యకర్తల్లో జోష్ పెరిగిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీగా క్యామ మల్లేశ్‌ను గెలిపిస్తే మన నియోజకవర్గ సమస్యలను ఢిల్లీలో వినిపిస్తారన్నారు. కారు గుర్తుకు ఓటు వేసి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని కోరారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సైదిరెడ్డి, కౌన్సిలర్ పల్లె విజయ్, నాయకులు వెంకటేశ్వర్లు, రావిరాల మల్లయ్య, దైద పరమేశం, రాచకొండ వెంకన్న పాల్గొన్నారు.

## నోముల భగత్‌కు ఎన్నెస్పీ క్వార్టర్ తిరిగి అప్పగించండి

- నీటి పారుదల శాఖ అధికారులకు హైకోర్టు ఆదేశం



ORDER

Mr.Saidam Laxmi Narayana, learned Assistant Government Pleader for Irrigation and Command Area Development accepts notice on behalf of the respondents and seeks time to get instructions in the matter.

It is the specific contention of the petitioner that without putting him on notice and without affording him an opportunity, respondent No.2 came to the Quarter No.EE/19 at Hill Colony, Nagarjuna Sagar, Nalgonda District, on 02.04.2024, locked and sealed the said premises. There is specific assertion to the said effect in paragraph No.13 of the writ affidavit.

The petitioner is an Ex-MLA Nagarjuna Sagar Assembly Constituency and a practicing Advocate.

In view of the above, matter requires detailed examination.

Therefore, respondent No.2 is directed to unseal Quarter No.EE/19, Hill Colony, Nagaruna Sagar, Nalgonda District, within 48:00 hours from now.

It came to the notice of this Court that several persons are in illegal occupation of quarters in Nagarjuna Sagar, Nalgonda District. Therefore, the Principal Secretary, Irrigation and Command Area Development is directed to conduct an enquiry and submit a report to this Court with regard to the same by the next date of hearing.

List on 19.06.2024.

SD- G.SHREESHA
ASSISTANT REG

//TRUE COPY//

SECTION OFFICER

నీరుపారుదల శాఖ ఉన్నతాధికారులకు హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులు

హాలియా, మే 2 : నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీలో గల ఈఈ-19 ఎన్‌ఎస్పీ క్వార్టర్‌ను మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌కు 48 గంటల్లోగా తిరిగి అప్పగించాలని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు గురువారం నీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలు అధికార పార్టీకి, ప్రభుత్వ ఉన్నతాధికారులకు చెంపపెట్టులాంటివని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. హిల్‌కాలనీలోని ఈఈ-19 ఎన్‌ఎస్పీ క్వార్టర్‌ను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నీరుపారుదల శాఖ అధికారులు మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్‌ను కేటాయించగా రెండేండ్లుగా అక్కడే నివాసం ఉంటున్నారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులు కక్ష సాధింపు చర్యలకు తెరలేపారు. భగత్‌కుమార్ వెంటనే క్వార్టర్‌ను ఖాళీ చేయాల్సిందిగా అధికార పార్టీ నాయకులు ప్రభుత్వ ఉన్నతాధికారులపై ఒత్తిడి తేవడంతో గత నెల 2న ఎలాంటి నోటీసులు, ముందస్తు సమాచారం లేకుండా అధికారులు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో సామగ్రిని మున్సిపల్ వాహనంలో స్టోర్‌రూమ్‌కు తరలించారు. ఈ విషయాన్ని నోముల భగత్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లగా అన్ని విషయాలు పరిశీలించిన ఉన్నత న్యాయస్థానం మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కు 48 గంటల్లోగా తిరిగి క్వార్టర్‌ను అప్పగించాలని నీరుపారుదల శాఖ అధికారులను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో బీఆర్‌ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందని, ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు కక్ష సాధింపు చర్యలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు.

## టీఎస్ ఎడ్‌సెట్ దరఖాస్తులకు 6 వరకు చివరి గడువు

- ఎడ్‌సెట్ చైర్మన్ గోపాల్ రెడ్డి

రామగిరి, మే 2 : తెలంగాణ వ్యాప్తంగా రెండేళ్ల బీఈడీ కోర్సులో చేరడానికి నిర్వహించే టీఎస్ ఎడ్ సెట్-2024 ఆన్‌లైన్ దరఖాస్తుల గడువు ఈ నెల 6 వరకు ఉందని మహాత్మా గాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్, టీఎస్ ఎడ్‌సెట్ చైర్మన్ సీహెచ్ గోపాల్ రెడ్డి, కన్వీనర్ మృణాళిని గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి టీఎస్ ఎడ్‌సెట్ నిర్వహణ బాధ్యతను రెండో పర్యాయం ఎంజీయూకు అప్పగించిందని వెల్లడించారు. ఈ నెల 13 వరకు రూ. 250 అపరాధ రుసుముతో దరఖాస్తులు సమర్పించడానికి అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులతోపాటు డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం https://edcet.tsche.ac.in సందర్శించాలని తెలిపారు.

## లోక్‌సభ ఎన్నికల సమయం గంట పొడిగింపు

- 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

నల్లగొండ, మే 2 : ఎండల తీవ్రత దృష్ట్యా లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సమయాన్ని కేంద్ర ఎన్నికల సంఘం మరో గంట సమయాన్ని పొడిగించింది. ప్రజల ఇబ్బందుల నేపథ్యంలో వివిధ రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 13న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉండగా, ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పెంచింది. నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో ఓటర్లు పెద్ద ఎత్తున పాల్గొని ఓటింగ్ శాతం పెంచాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.